


# నంది తల తిప్పింది

ఇప్పిలి మధు, విజయనగరం, ఆంధ్ర ప్రదేశ్

"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్ట మొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

**జనానికి ఏది చూసినా వింతే** , ఈ ప్రపంచం అంతా ఒక పాలపుంతే . మన బ్రహ్మం గారు చెప్పినవన్నీ జరుగుతున్నాయి అంట, ఈత చెట్టుకు మల్లెపూలు పూస్తాయి అంట,పంది కడుపున ఏనుగు పుడుతుంది అంట. ఇవన్నీ ఏమో గానీ మా వూర్లో నంది తలతిప్పింది అంట. ఏమిటో వినడానికే చాలా ఆశ్చర్యంగా,వింతగావున్నా మావూర్లో అందరినోటా ఇదే మాట. శివాలయంలో నంది తల తిప్పింది.మాపాలేరు కొద్దిగా భయంతో కూడిన భక్తితో ఈవిషయం చెబుతుంటే నాకు నమ్మశక్యం కాలేదు.సరే,ఒకసారి చూస్తే పోలా అని అనుకుంటూ లేస్తుండగా అప్పుడే మా తాతయ్య పొలంనుండి వస్తూ కనిపించాడు .

అమ్మయ్య,తాతయ్య వచ్చేశాడు.ఇక ఈయనని అడిగితేసరి,నిజమేంటోతెలుస్తుంది. అని మనసులో అనుకోని,"తాతయ్యా,నీకు ఈ విషయం తెలుసా" అన్నాను.

ఏంట్రా..మన వూర్లోకి వచ్చిన పులి సంగతా?అది నిన్ననే పట్టుబడింది కదరా, దాని అడవిని మనం ఆక్రమించినందుకు దానికి అనే జైలు శిక్షవేసి జూ లో పడేశారు. నిన్న టీవిలో కూడా చూశానురా" అన్నాడు మా తాతయ్య వస్తూనే గొడ్లచావడి దగ్గర నులకమంచం మీద కూర్చుంటూ.

పులి విషయం కాదు తాతయ్యా," మన వూరి చివర శివాలయంలో నంది తల తిప్పింది అంట. నీకు తెలీదా? ఊరు ఊరంతా ఈ వార్త గుప్పుమంటుంది. అంటూ ఒక కొత్త విషయం నేనే నీకు మొట్ట మొదట చెబుతున్నాను సుమా! అన్నట్లు చెప్పాను .

తాతయ్య మొహంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు.

చాలా సాధారణంగా మాట్లాడుతూ,నిజమా,నాకు తెలీదే.ఎప్పుడైంది రా ఇది ? అంటూ తిరిగి ప్రశ్న వేశాడు తాతయ్య .

“ నిన్నరాత్రి పూజారిగారు కోవెలకట్టే సమయానికి అంతా సవ్యంగా వుందంట,కానీ తెల్లవారివచ్చి పూజకోసం ఆలయంకడిగే సమయానికి చూస్తే నంది వీధిలోకి తలతిప్పి చూస్తోంది అంట” పూజారి గారు చాలా భయంతోకేకలు పెట్టేసరికి వూరిలో వాళ్ళు వెళ్ళి చూశారు అంట.” ఏమిటో అంతా విచిత్రంగా వుంది తాతయ్యా “. అన్నాను.

తానుకూడా చూడని నిజాన్ని కళ్ళు మూసుకున్న న్యాయదేవత ముందు పెట్టే లాయర్ లాగా. లాయర్ అని ఎందుకు అన్నాను అంటే ఎప్పుడూ నేను మాతాతయ్యతో చేసే పని వాదించడమే. ఆయన ఏదీ ఒక పట్టాన నమ్మడు.నమ్మితే దానిని వదలడు. ఆయన ఒక నాకు ఒక గ్రంథం. అచ్చు తప్పులు లేని ఒక ప్రభందం.

వెంటనే తాతయ్య నవ్వుతూ “ఇందులో విచిత్రం ఏమి వుంది రా చిన్నా. నంది ఏమి చేస్తుంది.? అని నన్ను తిరిగి ప్రశ్నించాడు.

“ ఏముంది తాతయ్య దేమునివైపు చూస్తుంది, దేముడు ఎటువున్నాడో మనకు చూపిస్తుంది” చాలా గర్వంగా సమాధానం ఇచ్చాను.

అంతేరా,” దేముడు అటువున్నాడో ఏమో, అందుకే అటుతల తిప్పి చూస్తోంది.లేదా నువ్వు చెప్పినట్టు మనకు దేముడుఅటు వున్నాడు అని తలతిప్పి చూపిస్తుంది.”అన్నాడు ధీమాగా.

నేనుచెప్పినదే కానీ తాతయ్య మరో విధంగా చెప్పాడు.కానీ ఇందులో ఏదో శ్లేష వున్నట్టు అనిపించి,తాతయ్య ఈ విషయం హాస్యంగా తీసుకున్నాడు ఏమో అనుకోని..

“తాతయ్య,నీకు నేను చెప్పినది సరిగ్గా అర్థం కాలేదేమో, ఒకసారి వెళ్ళి చూడు తాతయ్య. గర్భగుడిలో శివలింగం అలాగే వుంది అంట కానీ నంది మాత్రం వెనుకకు తలని తిప్పి చూస్తుంది అంట.ఇది వింతే కదా తాతయ్య ! కాలజ్ఞానంలో చెప్పినట్టే కదా జరుగుతుంది అన్నాను”.కొద్దిగా కోపం, చిన్నబాధ కలిగిన స్వరంతో.

చెప్పానుగా ఆయన సాక్షాలు అక్కరలేని జడ్జ్,నేను నల్లకోటు లేని లాయరు అని.

“ కాలజ్ఞానం కన్నా కాలం మారుతోంది అంటే కరెక్టే ఏమోరా చిన్నా ” అంటూ తాతయ్య చిన్నచిన్న ఇత్తడి గంటలు అన్నీ ఏరి ముడులు కట్టి మా ఎద్దుకు దండ తయారు చేసే పనిలో పడ్డాడు.

నేను వెంటనే లేచి,”తాతయ్య” “ నువ్వు దేముడి గురించి చెపితే అలా అంటావేంటి? నువ్వు దేముడిని నమ్మవా?అసలు నీ దృష్టిలో దేముడు లేడా?” అంటూ కోపంతో త్రిమూర్తులు లాగా ఒక మూడు ప్రశ్నలు సంధించాను.

తాతయ్య ఏ మాత్రం తొణకకుండా,బెణకకుండా అలాగే తన పనిచేసుకుంటూ ” కోపం ఎందుకురా చిన్నా? దేముడులేడు అని నేను ఎప్పుడైనా నీతో అన్నానా , కనీసం ఇప్పుడైనా నీతోఅన్నానురా? దేముడు శివాలయంలోవున్నాడు,రామాలయంలో వున్నాడు,అందరూ వెళుతున్నారు,అభిషేకాలు,పూజలు,అర్చనలు,హారతులు అన్నీదేముడికి సమర్పిస్తున్నారు.ఇవన్నీ దేముడు లేకుండా ఎలా చేస్తారురా? అంటూ ఎదురు ప్రశ్న వేశాడు.

తాతయ్యలో ఏమాత్రం కోపంగానీ,మాటలలోతొట్రుపాటు,కనీసవ్యంగ్యం కానీ ఎక్కడా కనపడలేదు. ఇన్ని మాటలు కూడా తన పని చేస్తూనే నాతో మాట్లాడుతున్నాడు.

వెంటనే నేను“మరైతే నేను చెప్పింది ఎందుకు నమ్మకుండా అలా వాదిస్తావు తాతయ్య? ఎందుకు ఎప్పుడూ గుడికి రావు. కనీసం ఈ రోజైనా గుడికి రా తాతయ్య,ఒకసారి వెళ్ళి కలిసి చూద్దాం “అంటూ బతిమలాడాను.

వెంటనే తాతయ్య నవ్వుకొని,ఒరే చిన్నా,నన్ను నాపని చేసుకోనీ రా. నేను నా పని చేసుకోవటం , వీలయితే ఎవరికైనా సాయం చేయటం ఈ రెండింటిలో వున్న ఆనందం నాకు ఇలా గుళ్ళు , గోపురాలు తిరగడంలో రాదురా “ అంటూ మళ్ళీ తన పనిలో పడ్డాడు.

నాకు ముక్కు మా తాతయ్యది వచ్చింది కానే కోపం మాత్రం మా అమ్మమ్మది వచ్చింది అని మా అమ్మ అంటుంది. అలా నాముక్కు మీద కోపం,దానికి తోడు మా తాతయ్య దేనినీ చూడకుండా ఒక స్థిర అభిప్రాయంకి వచ్చి మాట్లాడటం , ఆయన వితండవాదం నాలో కోపానికి మరింత ఆజ్యం పోసింది.

నేను వెంటనే " అంటే ఈ దేశం లో ఎవరు పని చేయకుండా అంతా దేముని మీద భారం వేసి,గుళ్ళకి,గోపురాలకితిరుగుతున్నారుఅంటావా?అంటూ మా తాతయ్యని క్రాస్ ఎక్సామినేషన్ చేసే ప్రయత్నం చేశాను.

తాతయ్య చాలా ప్రశాంతంగా టూత్ పేస్ట్ ప్రకటనలో హీరోలాగా ఒక అందమయిన నవ్వుతో నా వైపు చూస్తూ ఇలా అన్నాడు.

చిన్నా.. నువ్వు చిన్నోడివి రా.. చాలా చిన్నోడివి..నువ్వు చాలా జీవితం చూడాలి రా.

ఈ ప్రపంచం లో ప్రతి మనిషి తనపని , తాను చేయవలసిన పని , తనకై నిర్దేశించిన పని చేసుకుపోతూ వుంటే, మనిషికి మరో మనిషి లేదా దేముడి అవసరం ఏమి వుంది రా?

రెవెన్యూ ఆఫీసు లో గుమాస్తా తన పని కరెక్టుగా చేస్తే మన పనిమనిషి రమణమ్మ పెన్షన్ కోసం దేముడికి మొక్కుకోవాలసిన అవసరం లేదు కదరా ?

రోడ్డు ఇంజనీర్ తనపని సరిగాచేస్తే,సెంటర్ రోడ్డు మీద ఆ గుంత వచ్చేది కాదు, అందులో పడి మీ చిన్నాన్న కాలు విరిగేది కాదు. మీ చిన్నాన్నకి ఆదెబ్బ తగ్గితే మీ పిన్ని ఆ కొండకి నడుచుకొని వస్తాను అని దేముడిని మొక్కేది కాదు.

ఇదేరా పని విలువ.నా దృష్టి లో పనేరా దైవం. పనిలో దేముడిని చూడాలి, దేముడు అంటే నా దృష్టి లో సాయంరా . నీ పని ద్వారా ఎవరికైనా సాయం చేయడం అంటే అది దైవ ప్రార్ధన తో సమానం అంటూ

చెప్పానుగా " ఈ ప్రపంచం లో ప్రతి మనిషి తనపని, తాను చేయవలసిన పని,తనకై నిర్దేశించినపని రోజూ కనీసం ఒక గంట చేసినా, ఈ భూమికి మనం మరో పేరు పెట్టవచ్చు అది ఏమిటో తెలుసా " స్వర్గం " అని। స్వర్గం అంటే నీకు తెలుసు కదా అసలు కష్టాలు అనేవి లేని ఒక అద్భుతమైన ప్రదేశం అని.

కానీ,చాలామంది, రోజుకి వున్న ఇరవై నాలుగు గంటలలో,చాలా తక్కువ సమయం తమ గూర్చి, తమపని గూర్చి ఆలోచిస్తారు. ప్రతివాడూ ఎదుటివాడు ఎలా పెద్దవాడు అయ్యాడో అని ఆలోచించుకు కూర్చుంటే ఇక తన పని తాను పని చేస్తాడు , ఎప్పుడు ఎదుగుతాడు రా ? ఇకపోతే కోవెలకు వెళ్ళడం,వెళ్లకపోవడం అనేది వారి వారి స్వంత నిర్ణయం బట్టి వుంటుంది. ఏం జీవితం లో ఊహ తెలిసిన తరువాత కోవెలకు వెళ్లని సినిమా హీరో నాగేశ్వరరావ్ కి, ప్రముఖ వ్యాపారవేత్త రామోజీ రావుకి దైవ కృప లేదంటావా ? అంటూ తన మనసు లోని మొత్తం భావం ఆయన వెళ్ళగక్కాడు.

నేనేమీ ఊరు కోలేదు. వెంటనే అందుకొని " అంటే పని చేస్తేనే దైవ కృప కలుగుతుంది అంటావు. దేవుడు తన పని తాను చేసుకు పోతాడు అంటావు." అన్నాను.

ఆయన వెంటనే అందుకొని , అంతేరా చిన్నా.అంతే,

" ఇంతకీ దేముడు,తన పనీ అన్నావు,ఏమిటిరా, దేముడిపని " అంటూ నాకు ఎదురు ప్రశ్న వేశాడు మా తాతయ్య.

తాతయ్య కు వివరణ ఇచ్చే సమయం వచ్చింది అనే ఆనందంతో, ఏమి లేదు తాతయ్య

" దేముడు అంటే సృష్టి , స్తితి , లయ కారకుడు.

జీవులని సృష్టించడం,వాటి జీవన మార్గం సమీక్షించడం,వాటి ఆయుష్షు తీరిపోతే లయం చేయడం దేముడి పని. అందుకే దేముడు అనే పదాన్ని ఇంగ్లీష్ లో గాడ్ అని అంటారు, గాడ్ లోమొదటి అక్షరం జి అంటే జెనరేషన్ అంటే పుట్టించడం అనేది బ్రహ్మగారు చేసే పని.

ఓ అంటే ఆర్గనైజేషన్ అంటే నడిపించడం అంటే విష్ణువు పని ఏమిటో తెలుసా , తాను రక రకాల అవతారాలు ఎత్తి ఈ జీవుల జీవన గమనాన్ని కష్టం నుండి గట్టెక్కించడం .

డి అంటే డిస్ట్రక్షన్ అంటే నాశనం చేయడం. అంటే ఆయుష్షు తీరిన జీవరాసులను లయం చేయడం శివుడు పని.

చూడు తాతయ్యా ఎలా సరిపోయిందో ఆ స్పెల్లింగ్ కి, ఈ త్రిమూర్తులకి" అంటూ మా ఇంగ్లీషు సర్ చెప్పిన గాడ్ పదం అర్థాన్ని తెల్లవారి రోజూ టివిలో ప్రసంగించే స్వామీజీ ప్రసంగానికి కలిపి కొత్త వివరణ ఇచ్చాను.

వెంటనే తాతయ్య మళ్ళీ నవ్వుతూ " చూశావా, దేముళ్ళు కూడా ఏమి చేస్తున్నారు రా చిన్నా,తనపని,వారికి నిర్దేశించిన పనిచేసి మానవాళికి మహోపకారం చేస్తున్నారు. కానీ,నువ్వు నేనే, ఏ పనీలేకుండా పోట్లాడుకుంటున్నాం. కాబట్టి నాతో ఈవాదనలు ఆపి పట్నం వెళ్ళి మన నిమ్మ తోటకి ఎరువులు కొనుక్కొని రా.రా చిన్నా" అన్నారు.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. దేముడి గురించి ఇప్పటివరకు ఎవరూ చెప్పని రీతిలో చెప్పినా దానిని తన సిద్ధాంతం వైపు మలుచుకోగలిగే ఆయన మేధస్సు చూస్తే నాకు ఆయన వాదం, పిడి వాదం కాదు అనిపించింది.

మరీ ఆ శివాలయం సంగతి ఏమిటి?ఆ వింత కోసం ఊరు అంతా కోడై కూస్తోంది,ఏమిటో అంతా తికమకగా వుంది.

ఏమో తాతయ్య చెప్పినట్లు దేముడు బయటకు వచ్చాడు ఏమో,అదీ చూద్దాం. అందులో నిజమెంతో అప్పుడు తెలుస్తుంది.అంటూ కోవెలవైపు దారితీశాను.అదికూడా ఒకసారి చూసుకొని ఎరువులకు పట్నం వెళదాం అని.

ఓ ఐదేళ్లు రష్యాలో నా డాక్టర్ డిగ్రీతో గడిచిపోయింది. దాని తర్వాత ఇదిగో ఇప్పుడే మా తాతగారి ఊరు రావడం.అప్పటికీ,ఇప్పటికీ మా ఊరుచాలా మారి పోయింది.మట్టిరోడ్లు అన్నీ సిమెంట్ రోడ్లుగా,కాలువలు,గ్రంథాలయం,ఆసుపత్రి,పశువుల కోసం మరోక్లినిక్ ఇలా అన్ని కనీసఅవసరాలు తీర్చే ఆధునిక కోవెలలు అన్నీ కలిసి మా ఊరి రూపురేఖలు మార్చేసాయి. దీనికి ముఖ్యకారణం మాఊరి ప్రెసిడెంట్ గారు.ఆయన చెప్పేదే మా ఊరిలో వేదం,ఆయన చేసేదే అందరికీ ఆమోదం.

ఆయన పరమ శివభక్తుడు. మాఊరి శివాలయం ధర్మకర్త కూడా ఆయనే. అందుకేనేమో ఆయన మాఊరి శివాలయంకి జీవకళ తీసుకొనే పనికి కంకణం కట్టుకున్నారు. దేవాలయం ఆలనాపాలన కోసం కోవెలభూములు అన్నీ లీజుకి ఇచ్చి,ఆ డబ్బుతో కోవెల చుట్టూ షాపులు కట్టించారు. మా ఊరిలో బడికైనా,దేమునిగుడికైనా రంగులు వేయించాలన్నా,ఆసుపత్రికి గ్రంథాలయంకి కరెంటు కావాలన్నా తీర్చగల సమర్థుడు ఆయనే.

అందుకే చాలామంది ఆయనని దేముడులాంటి మనిషి అంటారు.ఆయన మా తాతయ్య చిన్నప్పటి నుంచి స్నేహితులు. కానీ మా తాతయ్య కనీసం కోవెలకు రారు.మా తాతయ్య దేముడిని తన ప్రెసిడెంట్ ఫ్రెండ్లో చూస్తారేమో,అని అనుకుంటూ కోవెల వీధి లోనికి ప్రవేశించాను .

నేను ఇలా కోవెలకు రావడం గత అయిదేళ్లలో ఇదే మొదటిసారి కావడంతో కోవెలను గుర్తుపట్టలేక పోయాను. అది చాలా పురాతన కోవెల. కానీ ఇప్పుడు అక్కడ అంతా మార్కెట్ లాగా వుంది. ఒకప్పుడు గుడికి దగ్గరలో మా సత్తిగాడి టిఫిన్ కొట్టు,మరో రెండు కొబ్బరి కాయల కొట్లు వుండేవి.కానీ నేడు షాపుల మధ్యగుడి వున్నట్లు వుంది. గుడిచుట్టూ ఒక పది షాపులు. ఈరోజు గుడిలో వింతను ఎవరో సోషల్ మీడియాలో పెట్టారు అంట.అందుకేనేమో గుడి చుట్టూ కోలాహలం. గుడి దగ్గర జన సంద్రం.

ఇంతలో నా దగ్గరకు ఒక పది మంది లాగా చేరి " బాబూ అభిషేకం కోసం పాలు,పూజకి సెట్ తీసుకోండి అంటూ అమ్మడం మొదలుపెట్టారు. మరీ కాదనలేక ఒక పూజసెట్,పాలు తీసుకున్నాను.అప్పటికే కోవెల చాలా రద్దీగా వుంది.నందీశ్వరుడికి అభిషేకాలు, పూజలు జరుగుతున్నాయి. లోపల శాంతి హోమం చేస్తున్నారు అని అప్పుడే లైవ్ కవర్ చేస్తున్న టీవి యాంకర్ చెబితే విన్నాను.

నాకయితే చాలా ఉత్సాహంగా వుంది. నేను వింత చూడబోతున్నాను అనే ఆతృత. నంది ఎందుకు తల తిప్పిందా అనే అనుమానం. ఇలా రకరకాల వూహలతో కోవెల గేటు వైపు అడుగుపెడుతున్న నా చుట్టూ చేరిన ముగ్గురు పిల్లలు" సారూ,మీ జోళ్లు లోపల ఇప్పకండి. పోతాయి, ఇదిగో ఇక్కడ వుంచండి జతకి రూపాయే" అంటూ నా చుట్టూ మూగారు .

ఏంటీ ఈ ఊరిలోకూడా చెప్పులకు ఇంత సెక్యూరిటీ అవసరమా?అని మనసులో అనుకోని నా కొత్త చెప్పులు బయట వదలలేక , మరి చేసేదేమి లేక అందులో ఒక పిల్లవాడికి నా చెప్పులు అప్పచెప్పాను.

వాడు వెంటనే ఒక సిగరెట్ పాకెట్ అట్ట మీద నాలుగు అనే అంకె రాసి నాకు ఇచ్చాడు. మరొకటి నా చెప్పులలో పెట్టాడు. వాడికి రూపాయి ఇచ్చి ఒక పావుగంటకు నా చెప్పులను ఇన్సూరెన్స్ చేసిన రశీదు తీసుకొని జాగ్రత్తగా జేబులో పెట్టుకొని లోనికి నడిచాను.

కోవెల గుమ్మం దగ్గర యూనిఫారమ్ వేసుకున్న ఒక కాపలావాడు నన్ను ఎగాదిగా చూసి టికెట్ , టికెట్ అన్నాడు.
ఈ సారి ఇంకా ఆశ్చర్య పోయాను.

మా వూరిశివాలయంలో టికెటా?ఏమిటి ఈమార్పు.అంతా కొత్తగా అనిపించింది. అయినా ఈ సొమ్ము అంతా చేరేది దేముడికేగా,కోవెల అభివృద్ధి కోసమే కదా అనుకుంటూ " ఎంత ?" అని అడిగాను.

వెంటనే వాడు " ఏమిటి మీది , అభిషేకమా, అర్చనా, సహస్రనామార్చనా లేక ఈ రోజు నందీశ్వరునికి జరిగే స్పెషల్ పూజా ?" అని అడిగాడు.

నేను వచ్చింది ఆ నంది విషయం కోసం కదా.సరే ఆ స్పెషల్ పూజ కానిద్దాం అంటూ స్పెషల్ పూజకి టికెట్ తీసుకున్నాను. వెంటనే వాడు ఒక రెండు వందల రూపాయల టికెట్ కత్తిరించి ఇస్తూ బాబువెళ్ళి,అలా కాళ్ళు,చేతులు కడుగుకొని రండి అంటూ బావి వైపు చూపించాడు.

ఆ బావి చుట్టూ చాలా మంది జనాలు గుమిగూడి వున్నారు. అక్కడ ఉన్నది ఒకే ఒక చేద, దానితో నీళ్ళు తోడడం కోసం జనాలు దాదాపు తోసుకునే పనిలో వున్నారు. ఇంతలో ఒక కుర్రవాడు నూతిగట్టు పైకి చేరి,చేద రూపాయి,ఛేద రూపాయి, చేద రూపాయి అని ఒక చిన్న చేదతో నూతి నుండి నీళ్ళు తోడి అమ్ముతున్నాడు.

ఇలా జనాలతో వుంటే జరగని పని, అని అనుకొని రెండు చేదలు నీళ్ళు కొనుక్కొని కాళ్ళు , చేతులు , సగం ముఖం కడుక్కున్నా.

అక్కడ టికెట్ కత్తిరించే వాడు లోనికి దారి చూపిస్తూ" సార్ స్పెషల్ పూజకు ఈ చంగిడి పూలు చాలా అవసరం.పేకెట్ ఇరవై రూపాయలే,మీకు యాభైకి మూడు పేకెట్స్ తీసుకోండి సార్" అన్నాడు.

ఆ పూలు కూడా కొనుక్కొని, కోవెల మంటపంలోనికి అడుగుపెట్టాను. అక్కడ అప్పటికే ఒక వెయ్యి మంది లాగా జనాలు వున్నారు. కోవెల అంతా భక్తి భావంతో , వింతను చూడాలి అనే ఉత్సుకత తో వున్నారు.

కానీ నాది స్పెషల్ పూజ కావడంతో,నా చేతిలో పూలు,టిక్కెట్ చూసి ఒక పంతులు గారు నాకు లోపలికి వెళ్ళమని దారి ఇచ్చి అక్కడ మరో ఇద్దరు పంతుళ్లకు ఏదో సైగ చేసి చెప్పారు.

వాళ్ళు నన్ను బాగా పలకరించి,వారు కూర్చున్న వైపు రమ్మన్నారు.

అక్కడ సంప్రదాయ బద్దంగా నా కంటికి కనిపించిన ఒక పంతులు గారి దగ్గరకు వెళ్ళి నా చేతిలో టికెట్, పూజా ద్రవ్యాలు ఇచ్చి నిలబడ్డాను.

నా ఆతృత మాత్రం తగ్గలేదు. నంది వున్న వైపు చూశాను. ఏమి కనబడలేదు. నందిని పూర్తిగా అభిషేకాలు చేసిన కొబ్బరి కాయలుతో,రంగు రంగుల పూల దండలు, పంచెలు , కండువాలు ఇంకా పూజా సామగ్రి తో పూర్తిగా కప్పేశారు.

పది నిముషాలు రకరకాల మంత్రాలు చదివి,నేను తెచ్చిన కొబ్బరికాయ కొట్టి,నా చేతికి మంత్ర పుష్పం ఇచ్చి తాంబూలం దక్షిణగా ఒక యాభై పట్టుకోండి అన్నాడు ఆ సంప్రదాయబద్ధ పంతులు గారు.

నా జేబులో చిల్లర ఇంకా పది రూపాయలే మిగిలివున్నాయి.మిగతావి పెద్ద నోట్లు, పట్నం లో ఎరువుల కోసం వుంచినవి.

నాకు కొద్దిగా సిగ్గుగా అనిపించినా,ఇక చేసేదేమి లేక, అయినా దేముడి దగ్గరే కదా అని “ఇదుగోండి పంతులు గారూ,నా దగ్గర ఈ పది రూపాయలే వున్నాయి”. అన్నాను.

వెంటనే ఆ పంతులు గారు నాకేసి ఎగాదిగా చూసి “ రెండు వందలు పెట్టి టికెట్ కొన్నారు ఈ బ్రాహ్మణుడికి ఒక యాబై రూపాయలు ఇవ్వలేక పోయారు,ఇది చాలా విచారకరం సుమా” అంటూ నేను యాభై రూపాయలతో కొనితెచ్చిన చంగిడిపూలు వాడకుండానే పూజ ముగించాడు.

ఇంకా నంది పైన అందరూ తేనె, నెయ్యి,పాలు,చెరకురసం ఇలా ఒకటేమిటి,తమ తాహతుకి తగ్గట్లు అభిషేకాలు చేస్తున్నారు.

ఇంతలో బయట ఏదో కోలాహలం మొదలయింది. ఆలయ ధర్మకర్త ఐన మావూరి ప్రెసిడెంట్ గారు వస్తున్నారు అని.

అతను కూడా తన శక్తి మేర అన్ని పూజాద్రవ్యాలు తెచ్చి నందీశ్వరునికి అభిశేఖం చేయించారు. అతనితో కొంతమంది ఊరిపెద్దలు,పూజారులు ఏదో మాట్లాడేరు.ఇంతలో మా వూరి శివాలయం ప్రధాన పూజారిగారు వచ్చి ఆ నందికి నమస్కరించి,నమకం, చమకం చదివి నంది మీద వున్న ఆ పూజ ద్రవ్యాలు తొలగించడం మొదలుపెట్టారు.

నా జీవితంలో ఏ పరీక్ష ఫలితంకి నేను ఇంత హైరానా పడలేదు. కానీ ఆ వింత గురించి మాత్రం చాలా టెన్షన్ గా వుంది.

అందరికన్నా నేనే ముందు నందిని చూడాలి అనే అతి ఆతృత తో జనాలు తోసుకుంటున్నారు , ప్రైవేటు సెక్యూరిటీ జనాలని కంట్రోల్ చేస్తున్నారు.

ముగ్గురు బ్రాహ్మణులు నంది చుట్టూ నిలబడి ఒక పంచె అడ్డుగా కప్పి లోపల నంది చుట్టూ వున్న పూజా సామగ్రి , కొబ్బరి కాయలు బయటకు తీస్తున్నారు. ఇంతలో కోలాహలం మరింత ఎక్కువ అయింది.

నన్ను జనాలు తోసివేయడంతో,నేను మరి కొంత ముందుకు వెళ్ళి నందికి సరిగ్గా ఒక అడుగు దూరంలో పడ్డాను. ఇంతలో ఆ బ్రాహ్మణులు నంది చుట్టూ వున్న గుడ్డని పూర్తిగా తొలగించారు.

వెంటనే నేను నంది రెండు కొమ్ములపై నా బొటనవేలు, చూపుడు వేలు వుంచి ఆ ఖాళీ సందులోనుంచి చూశాను.

నా దృష్టి గుడి దాటి, జనసందోహాన్ని చీల్చుకుంటూ వెళ్లి ఎదురుగా ఉన్న ఒక పాత దుకాణం మీద ఆగింది. దూరంగా కోవెలచుట్టూకట్టిన షాపుల వరుసలో ఆఖరిషాపు అది . ఆ షాపులో ఒక పండు ముదుసలి తన చేతితో పసుపు,కుంకుమ చిన్న చిన్న పొట్లాలు కట్టి , నీలిరంగు మేని ఛాయలోవున్న ఆమె భర్తకి ఇస్తుంటే ఆయన వాటిని క్రమంగా ఆ కొబ్బరికాయల పక్కన జాగర్తగా సర్దుతున్నాడు. వయసుడిగినా ఎవ్వరిమీద ఆధారపడకుండా పనిలోనే ఆనందం వెతుకుతున్న ఇద్దరి ముఖాలలో ప్రశాంతత , పనిలో ఇద్దరికీ ఏకాగ్రత కనిపించాయి.

ఇంకొంచెం పైకి చూస్తే ఆ షాపు పేరు మెరుస్తూ కనిపించింది.

“ శ్రీ శ్రీ శ్రీ ఉమా రామలింగేశ్వర జనరల్ స్టోర్ “

ఇక్కడ పుణ్యం హోల్ సేల్ రేట్లకే రిటైల్ గా లభించును. “

ఆ నిమిషం నాకు తాతయ్య మాటలు స్ఫురణకు వచ్చాయి. నంది నిజంగానే తల తిప్పింది! కానీ అది గర్భగుడిలోని విగ్రహం వైపు కాదు... నిరంతరం శ్రమిస్తూ, కర్మనే దైవంగా భావించే ఆ నిరాడంబర దంపతుల వైపు. ఆ పార్వతి పరమేశ్వరులే పని ప్రాముఖ్యం వివరిస్తూ ఆ షాపు లో వున్నారేమో , భక్తి అంటే బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించడమేనని ఆ నంది మౌనంగా ప్రబోధిస్తున్నట్లు అనిపించింది."

★★★★